

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 19.0

సిల్వర్ షాక్ !

నరసాపురానికి చెందిన ఓ వ్యాపారి రెండు నెలల క్రితం వెండి పెరుగుదల చూసి కేజీ రూ.1.50 లక్షల చొప్పున ఐదు కేజీలు కొనుగోలు చేశాడు. ధర రూ.1.85 లక్షలకు వెళ్లినా అమ్మలేదు. ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఎదురు చూశాడు. ఒక్కసారిగా ధర తిరోగమనం పట్టింది. వారం క్రితం కేజీ రూ.1.45 లక్షలకు దిగింది. ఇంకా పడిపోతుందన్న భయంతో కొన్న వెండిలో మూడు కేజీలు అమ్మేసుకున్నాడు.

మార్టేరుకు చెందిన ఓ వ్యాపారి సిల్వర్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాడు. రియల్‌ఎస్టేట్ కుదేలవడం, బ్యాంకు వడ్డీలు తక్కువుగా ఉండటం, స్టాక్ మార్కెట్‌లు ఆశించిన స్థాయిలో లాభాలు ఇవ్వకపోవడంతో వెండి సరైన పెట్టుబడి అని భావించాడు. రానున్న రోజుల్లో భారీగా పెరుగుతుందన్న అంచనాతో 20 కేజీల వరకు కొనుగోలు చేశాడు. మారిన అంతర్జాతీయ పరిణామాలతో ధర తగ్గుముఖం పట్టింది. దీంతో మళ్లీ రూ.లక్షకు దిగుతుందన్న భయంతో కొన్న వెండిని అయినకాడికి అమ్ముకున్నాడు.





- వెండిపై పెట్టుబడులతో నష్టాలు
- పెరుగుదల చూసి భారీగా కొనుగోళ్లు
- గడిచిన రెండు నెలల్లో
- రూ.20 కోట్లపైనే మదుపు
- ధర పతనంతో వరుస అమ్మకాలు

నరసాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గడిచిన 20 రోజుల నుంచి జిల్లాలో బులియన్ మార్కెట్ వెండి కొనుగోలు కన్నా అమ్మకాలే ఎక్కువగా ఉన్నాయనేందుకు పై ఉదాహరణలే నిదర్శనం. ఇందులో లాభం గడించిన వారి సంఖ్య స్వల్పంగా ఉంటే నష్టపోయిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. 2008, 2012 సంవత్సరాల్లో వెండి ఊహించని విధంగా పెరిగింది. అప్పటి వరకు కేజీ రూ.30 లేదా రూ.35 వేల మధ్య ఊగిసలాడేది. 2008లో ఒక్కసారిగా పెరుగుతూ వచ్చి రూ.79 వేలకు చేరువైంది. 2012లోనూ రూ.80 వేలకు వెళ్లింది. ఆ తరువాత రూ.40 వేలకు పడిపోయింది. చాలాకాలం రూ.40 వేలు రూ.50 వేల మధ్యే ఊగిసలాడింది. 2021లో రూ.లక్షకు చేరి చాలాకాలం స్థిరంగా ఉండిపోయింది. ఆ సమయాల్లో వెండి ధర ఇంకా పెరుగుతుందన్న భావించి పెట్టుబడులు పెట్టిన వారంతా నిండా మునిగారు. ఈ ఏడాది ఇదే పరిస్థితి కనిపించింది. 2025 ఆగస్టు నుంచి మొదలైన పెరుగుదల అక్టోబరు రెండో వారం వరకు కొనసాగింది. ఒక సమయంలో కిలో రూ.1.75 లక్షలు ఉంటే బ్లాక్‌లో రూ.1.90 లక్షలు పలికింది. ఇదే సమయంలో విశ్లేషకులు సోషల్ మీడియాలో వెండి రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందన్న కథనాలు వచ్చాయి. దీంతో చాలామంది వెండిపై పెట్టుబడి పెట్టేందుకు మక్కువ చూపారు. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు, బంగారం తాకట్టు పెట్టి ఆయనకాడికి వెండి కొనుగోలు చేశారు. ఇలా జిల్లాలో గడిచిన రెండు నెలల కాలంలో దాదాపు రూ.20 కోట్లపైనే వెండిపై పెట్టుబడులు పెట్టినట్లు అంచనా. అత్యధికంగా నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పెనుగొండ ప్రాంతాలకు చెందిన వ్యాపారులతోపాటు స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు వెండిని కొనుగోలు చేశారు ఎంసీఎక్స్ మార్కెట్‌లో కాకుండా బహిరంగ మార్కెట్‌లో - మిగతా 8లో..

• కొనుగోలుకన్నా.. అమ్మకాలే ఎక్కువ



ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో సిల్వర్ బుల్ బేర్ ట్రెండ్ జరుగుతోంది. ధర ఇంకా తగ్గుతుందన్న భయం పెట్టుబడి దారుల్లో నెలకొంది. దీంతో కొన్న వెండిని అయినకాడికి అమ్మేస్తున్నారు. వీరిలో కొంతమంది లాభాలు స్వీకరిస్తుండగా.. ఎక్కువ మంది నష్టాలకే బుక్ చేసుకుంటున్నారు. మళ్లీ రికార్డుస్థాయి ధర రాదన్న భయంతోనే అమ్మకాలు చేస్తున్నారు.

- అత్మూరి వెంకట నరసయ్య, బులియన్ వ్యాపారి, నరసాపురం

33.75 లక్షల జీతం

శశి ఇంజనీరింగ్ విద్యార్థికి అమెజాన్‌లో ఉద్యోగం



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ చదువుతున్న నంబుల దీపక్ సాయి అమెజాన్‌లో రూ.33.75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్‌లు విద్యార్థి దీపక్ సాయిని అభినందించారు. విద్యార్థులు నైపుణ్యంతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని చైర్మన్ పేర్కొన్నారు.

నాన్న కష్టం చూస్తూ పెరిగాను : దీపక్

మాది తణుకు..నాన్న సత్యనారాయణ డ్రైవర్‌గా పనిచేస్తూ నన్ను, అన్నయ్యను బాగా చదివించారు. ఆయన శ్రమ చూస్తూ పెరిగాను. నాన్న కష్టానికి ఫలితం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ఏఐఎంఎల్‌లో చేరినప్పుడే మంచి ఉద్యోగం సాధించాలని బలంగా కోరుకున్నాను. నా కల నెరవేరింది. అమ్మా, నాన్నలకు ఇకపై ఏ కష్టం లేకుండా చూసుకుంటా..



భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తోట సీతా రామలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నియోజకవర్గ టీడీపీ కమిటీ సభ్యులు

టీడీపీలో జోష్

- పట్టణ, మండల కమిటీలకు గ్రీన్‌సిగ్నల్
- జిల్లా, అనుబంధ కమిటీలే పెండింగ్
- నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాలు
- అరెకరం స్థలం చూడాలని అధిష్ఠానం ఆదేశాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అధిష్ఠానం నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయనుంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ సంస్థాగత కమిటీలను వేయలేదు. పాత వాటితోనే కాలం వెళ్లదీస్తోంది. ప్రతీసారి రాష్ట్ర మహానాడుకు ముందే కమిటీలను ఏర్పాటు చేసేవారు. ఇటీవల మండల, పట్టణ కమిటీలకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి, పాలకొల్లు నియోజక వర్గాల్లో కమిటీలు బాధ్యతలు తీసుకున్నాయి. మరోవైపు జిల్లా, అనుబంధ కమిటీలైన రైతు సంఘం, మహిళా కమిటీలు, తెలుగు యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వాణిజ్య విభాగాల వారీగా అధిష్ఠానానికి జిల్లా నుంచి పేర్లు వెళ్లాయి. ఈ మేరకు అధిష్ఠానం ఐవీఆర్‌ఎస్ ద్వారా కమిటీల్లో పేరున్న ప్రతి ఒక్కరిపైనా అభిప్రా యాలను సేకరించింది. ఈ విధంగా ఇప్పటికే మండల, పట్టణ కమిటీలను ప్రకటించింది. జిల్లా, అనుబంధ కమిటీల విషయంలోనూ ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించింది.

త్రిసభ్య కమిటీ సమీక్ష

జిల్లా, అనుబంధ కమిటీల విషయంలో ఇటీవల అధిష్ఠానం పంపిన త్రిసభ్య కమిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కేడర్‌తో సమీక్షలు నిర్వహించింది. సామాజిక సమీకరణలకు పెద్దపీట వేసి అధ్యక్షులను నియమించాలంటూ చర్చకు వచ్చింది. ప్రతి నియోజకవర్గం నుంచి జాబితాలు వెళ్లాయి. అధిష్ఠాన నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లా అధ్యక్షునిపైనా త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జ్‌లంతా ఏకా భిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు కమిటీ అధిష్ఠానానికి నివేదిక ఇచ్చింది. ఇటీవల ఐవీఆర్‌ఎస్‌లో ప్రస్తుత అధ్యక్షుడు మంతెన రామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పేర్లతో అభిప్రాయ సేకరణ చేశారు. ఇతర జిల్లాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం అధ్యక్ష పదవి కేటాయిస్తుంది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటుకు అధిష్ఠానం నిర్ణయించింది. ఇందుకు అర ఎకరం స్థలాన్ని చూడాలని ఇన్‌ఛార్జ్‌లకు సూచించింది. పార్టీ కార్యక్రమాలు, సమీక్షలన్నీ ఈ కార్యాలయాల్లోనే ఏర్పాటుచేసేలా దృష్టి పెట్టింది.



బిర్సా ముండ చిత్రపటం వద్ద నివాళు లర్పిస్తున్న జేసీ, ఇతర అధికారులు

యువత బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలి

జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, నవంబరు 15 (ఆంధ్ర జోతి) : గిరిజన సమస్యలపై బ్రిటిష్ పాలకులతో పోరాటాలు చేసిన నాయకుడు బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినా దేశంలోని అన్ని గిరిజన జాతులకు అవగాహన కల్పిస్తూ బ్రిటిష్ వారి అరాచకాలను ఎదిరించారన్నారు. బిర్సాముండా చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. డీఆర్వో శివన్నారాయణ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పుష్పరాణి, జిల్లా సంక్షేమ సంక్షేమ శాఖ అధికారి అరుణ కుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

మొగల్లులో 17, 18 తేదీల్లో ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు

పాలకోడేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభలు ఈ నెల 17, 18 తేదీల్లో మొగల్లులో జరుగుతాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరేరాం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకుడు బి.బలరాం హాజరవుతారన్నారు. వ్యవసాయ పరిస్థితులపై చర్చించి ఉద్యమాలపై కార్యాచరణ చేపడతామన్నారు.రైతు నాయకుడు పాలా వెంకటస్వామి, వాసుబాబు, అశ్రియ్య పాల్గొన్నారు.



షాపులోకి దూసుకెళ్లిన కారు

పలువురికి గాయాలు

భీమవరం క్రైం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : భీమవరం పట్టణంలో శనివారం సాయంత్రం ఒక కారు బీభత్సం సృష్టించింది. వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ షాపులోకి వెళ్లడంతో అక్కడున్న ద్విచక్ర వాహనాలు, ఒక ప్లాట్ రిక్షా ధ్వంసమయ్యాయి. భీమవరం పట్టణంలోని ఒక ఆసుపత్రిలో మత్తు డైరెక్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి శనివారం ఉదయం అంతర్వేది దేవాలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా సాయంత్రం పీపీ రోడ్డులోని సత్యనారాయణ థియేటర్ సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న ద్విచక్ర వాహనం, ప్లాట్ రిక్షాను, ఎలక్ట్రికల్ షాపు గోడను ఢీకొట్టింది.ప్లాట్ రిక్షా నడిపే వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.

బేతపూడి రైతులకు రీసర్వే చిక్కులు

బేతపూడి రైతులకు రీసర్వే చిక్కులు తెచ్చిపెట్టింది. సర్వే సమయంలో పంట భూములు ముంపులో ఉండడంతో సర్వే చేయకుండా 700 ఎకరాలకు ఒకటే నెంబర్ ఇచ్చేశారు. ఇప్పుడు వాటిని సబ్ డివిజన్ చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అందులో 200 ఎకరాలకు సంబంధించి రెడ్ మార్క్ చూపిస్తోంది.. అధికారుల నుంచి జిల్లాస్థాయి యంత్రా ఒగం వరకు దీనిపై చేతు లెత్తేసింది. అధికారులేమో ఇది అమరావతిలోనే తేలాలని టెక్నికల్ సమస్య అని చెబుతున్నారు.. రైతులకు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు..



బేతపూడిలో చిక్కుల్లో ఉన్న పంట భూములు

- రీసర్వే సమయంలో ముంపులో భూములు
- సర్వే చేయకుండానే 700 ఎకరాలకు ఒకటే నంబర్
- అందులో 200 ఎకరాలకు రెడ్ మార్క్
- సమస్య పరిష్కరించాలని రైతులు వినతి
- అమరావతిలో టెక్నికల్ సమస్య అంటూ సమాధానం
- చేతులెత్తేసిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం

భీమవరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మండలం బేతపూడి గ్రామ రైతులకు రీసర్వే ఇప్పటికీ వదలని చీడలా మారింది. 2023 నవంబర్‌లో గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేశారు. గ్రామంలోని పంట భూములు 1200 ఎకరాలు ఉంటే వాటిలో 700 ఎకరాలు రీసర్వేకు వీలు లేకుండా నీటిలో ఉండడంతో ఒకటే నంబర్ భూమి అంతటికీ ఇచ్చేశారు. కొన్నినెలల తర్వాత వాటిని సర్వే చేయకుండానే జాయింట్ అకౌంట్‌లుగా మార్చేశారు. పలువురు రైతులకు కలిపి జాయింట్ ఎల్‌పీలుగా వచ్చింది. వాటిని సబ్ డివిజన్‌లు చేసుకోవాలని దానికి దరఖాస్తు చేసుకోవాలంటూ రెవెన్యూ శాఖ సూచించింది. అవసరమైన రైతులు సబ్ డివిజన్‌కి రూ. 500 చెల్లించారు. అయితే 203 ఎకరాలకు సబంధించి రెడ్‌మార్క్ ఏర్పడింది. దానివల్ల ఆ భూమికి సబ్ డివిజన్‌కి వీలులేకుండా పోయింది. రెడ్‌మార్క్‌ను తొలగించాలని రైతులు వేడుకుంటున్నా ఫలితం రావడం లేదు.

చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం

దరఖాస్తులు తామెలా చేసుకుంటామని ఒకే సమస్యగా గుర్తించి సబ్ డివిజన్‌లు రెవెన్యూ శాఖనే చేయాలని జాయింట్ అకౌంట్లు ఉన్న రైతులు పలు గ్రామ రెవెన్యూ సభలలో విన్నవించారు. దాంతో పాటు 203 ఎకరాల రెడ్‌మార్క్ సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని నెలల క్రితం తెలిపారు. అక్కడ నుంచి స్పందన రాలేదు. రైతులు ఇటీవల ఎమ్మెల్యే అంజిబాబుకు విషయాన్ని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అయినా రెడ్‌మార్క్ మారలేదు. రైతుల్లో నిరుత్సాహం నెలకొంది. అధికారులందరిదీ ఒకే మాట.. అమరావతిలో టెక్నికల్ సమస్య అని ఇది అక్కడే తేలాలని అంటున్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆటంకం

ప్రభుత్వం అందించే పథకాలు అందాలంటే పంట భూమి ఇంతే ఉండాలనే నిబంధన ఉంది. జాయింట్ ఎల్‌పీ వల్ల ఎక్కువ భూమి ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో రైతులకు శాపంగా మారుతుంది. మొన్న తల్లికి వందనం పథకం సమయంలో ఈ సమస్య వల్ల రైతులందరూ అనర్హులుగా నిలిచారు. అయితే ప్రభుత్వం రీసర్వే ప్రాంతాల్లో పరిగణనలోకి తీసుకోవద్దని నిర్ణయించడంతో - మిగతా 8లో..

• ఇంకా ఎన్నాళ్లు తిరగాలి ?



రెండేళ్ల క్రితం రీసర్వే అని మొదలుపెట్టారు. ఆయకట్టంతా ఒకే నంబర్ అన్నారు. జాయింట్ ఎకౌంట్ అన్నారు. మరలా రెడ్ మార్క్ అంటున్నారు. మా భూమి గతంలో లాగా లేదు. అధికారుల దగ్గరకు ఎన్నోసార్లు తిరిగాం. ఫలితం లేదు. ఎన్నేళ్లు ఇలా మా భూమి మా పేరున లేకుండా ఉండాలి.

- లోకం త్రిమూర్తులు, రైతు, బేతపూడి

• ఆన్‌లైన్‌లో 203 ఎకరాలు చూపిస్తోంది



మా పంట భూమి 2 ఎకరాల 20 సెంట్లు. ఆన్‌లైన్‌లో 203 ఎకరాలుగా చూపిస్తుంది. సబ్ డివిజన్ చేసుకోవడానికి లేదు. రెడ్‌మార్క్ అంటున్నారు. ఏ పథకం వచ్చినా అనర్హుల జాబితాలోకి వెళ్ళిపోతాం. అధికారుల దగ్గరకు వెళ్తే మారుతుందని అంటున్నారు.

- కె.పద్మారావు, రైతు, బేతపూడి

ప్రమాదం..చెంతనే!

- అగ్ని ప్రమాద వస్తువులు, ద్రవాల మధ్యలో పోలీసు విధులు
- రక్షణ చర్యలు శూన్యం
- జమ్మూ కశ్మీర్ పోలీస్ స్టేషన్‌లో పేలుడు
- ఉమ్మడి జిల్లాల్లో పోలీస్ స్టేషన్లలో పొంచి ఉన్న ప్రమాదం
- సీజ్ చేసిన వాటిని ప్రత్యేక యార్డుల్లో భద్రపరచాలి..



ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

- జిల్లాలో కొన్నేళ్ల క్రితం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో బాణసంచాను భారీగా పట్టుకుని స్టేషన్ ఆవరణలోనే పెట్టారు. రాత్రి ఏడు గంటల సమయంలో అప్పటి ఆ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం.సుధాకర్ (ప్రస్తుతం ఇంటిలిజెన్స్ డీఎస్పీ) తన సిబ్బంది స్టేషన్‌లో ఉండ గానే అకస్మాత్తుగా బాణసంచా పేలి పెద్ద ప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవ్వరు ఆవైపు లేకపోవడంతో ఎవరు ప్రమాదానికి గురి కాలేదు. సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయ్యారు. అప్పటి ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందిని అప్రమత్తం చేసి రక్షణ చర్యలు తీసుకుని ఉన్నతాధికారులతో బేష్ అనిపించుకున్నారు.
- ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన 150 మోటారు సైకిళ్లను రోడ్డు పక్కనే పార్కు చేసి ఉంచడంతో రాత్రి వేళ గుర్తు తెలియని ఒక వ్యక్తి సిగరెట్ కాల్చి పడవేయడంతో అది కాస్త పెట్రోల్ పైపుకి నిప్పు రవ్వ అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అనేక మోటారు సైకిళ్లు, రెండు లారీలు దగ్ధమయ్యాయి. జంగారెడ్డి గూడెం పోలీస్ స్టేషన్‌లోను ఇలాంటి సంఘటనే సంభవించింది.

ఏలూరు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో శుక్రవారం (ఈనెల 14వ తేదీ) అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. శ్రీనగర్‌లోని నవ్‌గామ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ పేలుడు సంభవించి తొమ్మిది మంది మృత్యువాత పడగా మరో 27 మంది తీవ్ర గాయాల పాలైనట్టు ప్రాథమిక సమాచారం. మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది ఉన్నారని వెల్లడిస్తున్నారు. ప్రమాదానికి కారణం సీజ్ చేసిన పేలుడు పదార్థాలను పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్టి వాటిని పరిశీలిస్తుండగా ఈ ఘటన జరిగి పోలీస్ స్టేషన్ ధ్వంసమైనట్టు అక్కడ అధికారులు వెల్లడించారు. అయితే ఈ ఘటన నవ్‌గామ్ పోలీస్ స్టేషన్‌కే పరిమితం కాదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది. అయితే అక్కడ వారు పేలుడు పదార్థాలను పోలీస్ స్టేషన్ ఆవరణలో భద్రపరిచి ఉండవచ్చు. కాని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులు, సామగ్రి ప్రతి పోలీస్ స్టేషన్ చుట్టిముట్టే ఉన్నాయి.

జిల్లాలో గతంలో స్టేషన్ల వద్ద మందుగుండు సామాగ్రి వల్ల జరిగిన ప్రమాదాలు ఉన్నాయి. సాధారణంగా పోలీ సులు వాహనాలు తనిఖీలు చేసినప్పుడు అనుమానాస్పదంగా ఉన్నవాటిని సీజ్ చేస్తారు. వివిధ దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన వస్తువులను, వాహనాలను స్టేషన్ ఆవరణలోనే భద్రపరుస్తారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, హత్య కేసులు, దోపిడీలు, దొంగతనాల్లో ఉప యోగించిన వాహనాలను సీజ్ చేసి స్టేషన్ ఆవరణలోనే భద్రపరుస్తున్నారు. దీపావళి పండుగకు ముందు అక్ర మంగా బాణసంచా నిల్వ ఉంచిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని తీసుకొచ్చి స్టేషన్ రూముల్లోనూ, స్టేషన్‌లోనూ భద్రపరుస్తున్నారు. ఇక సారా, గంజాయి, మద్యం కలిగిన వారిని అరెస్టు చేసి వాటిని సీజ్ చేసి స్టేషన్‌లోని రూముల్లోనే భద్రపరుస్తున్నారు. ఇవన్నీ అగ్ని ప్రమాదాలు జరిగితే త్వరితగతిన మంటలను వ్యాపింప చేసే పదార్థాలే.

సీజ్ చేసిన వస్తువులతో జాగ్రత్త అవసరం

ప్రస్తుతం జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించినా వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటారు సైకిళ్లు ఆ స్టేషన్ చుట్టూ ఉన్నారు.ప్రతి ట్యాంకులోనూ పెట్రోలే ఎంతో కొంత ఉంటుంది. ఒక వేళ పెట్రోలు లేకపోయినా ప్రతి వాహనానికి టైర్లు, ట్యూబులు ఉంటాయి. స్పాంజి సీట్లు ఉంటాయి.అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే మంటలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. రబ్బరు వస్తువులు, వైర్లు మద్యం, పాన్‌పరాగ్, గుట్కా, గంజాయి వంటివి ఉన్నాయి. గతంలోనే ఒక రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఇలాంటి సీజ్ చేసిన అన్నింటిని ప్రత్యేకంగా ఒక యార్డు లాంటిది ఏర్పాటు చేసి అక్కడ భద్రపరిస్తే సురక్షితమని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినప్పటికి బుట్టదాఖలైనట్లే తెలుస్తోంది.

ప్రస్తుతం పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాదపు అంచుల్లోనే తమ విధులను నిర్వర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యలు పరిశీలించి భద్రత కల్పించాలని విజ్ఞులు కోరుతున్నారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణగా తీసుకుని ఉమ్మడి జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని అగ్ని ప్రమాదాలకు కారణమైన వస్తువులు, ద్రవాలను వేరే ప్రాంతాల్లో భద్రపరచడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో 33, పశ్చిమ గోదావరి జిల్లాలో 24 లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్ల ప్రాంగణాల్లో సీజ్ చేసిన వాహనాలు సుమారు 4 వేలు ఉన్నాయి.



స్పోర్ట్స్ కార్నర్

ఆర్చరీ క్రీడాకారులకు జేసీ అభినందన



జేసీ రాహుల్‌తో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

భీమవరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-14, 17 విభాగాల్లో ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు భీమవరం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని శనివారం కలిశారు. ఆయన క్రీడాకారులను అభినందించారు. స్కూల్ గేమ్స్ అండర్ -17 విభాగంలో ఎం.సుహాస్, ఎం.సూర్య హంసిని బంగారు, వి.స్ఫూర్తి హంసిని వెండి, సబ్ జూనియర్ విభాగంలో సుహాస్ బంగారు, కనిష్క వెండి పతకాలను సాధించారు. స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారు వారణాసిలో జరిగే 69వ నేషనల్ గేమ్స్‌లోను, సబ్ జూనియర్స్ విభాగంలో పతకాలు సాధించిన వారు అరుణాచల్‌ప్రదేశ్‌లో 23 నుంచి 30 వరకు జరిగే నేషనల్స్‌లో పాల్గొననున్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నూతక్కి మోహన్‌దాస్, డీఈవో ఇ.నారాయణ, స్పోర్ట్స్ అథారిటీ కోచ్ జయలక్ష్మి, ఇ.సాహితీ, పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు యశ్వసిన్



యశ్వసిన్‌ను అభినందిస్తున్న ఎస్పీ అస్మి

భీమవరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):పాలకొల్లు పట్టణ ఎస్‌ఐ జీజే ప్రసాద్ కుమారుడు ఎ.కారుణ్య యశ్వసిన్ కాకినాడలో జరిగిన 37వ అంతర్ జిల్లా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 8-10 ఏళ్ల బాలుర ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ విభాగంలో 2వ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. డిసెంబరు 5 నుంచి విశాఖపట్నంలో జరగనున్న జాతీయ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. యశ్వసిన్‌ను ఎస్పీ నయీమ్ అస్మి, డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద అభినందించారు.

ఆర్చరీలో హంసినికి కాంస్య పతకం



హంసినిని అభినందిస్తున్న సూర్యప్రకాశరావు

తణుకు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):తణుకు మాంటిస్సోరి జూనియర్ కాలేజీ విద్యార్థిని నిట్టా హంసిని ఈనెల 7, 9 తేదీలలో పాడేరులో స్టేట్ లెవెల్ అండర్ -17 ఆర్చరీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నట్లు మాంటిస్సోరీ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. హంసినీ, కోచ్ పార్వతి చకియాను అభినందించారు. హెచ్‌ఎం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జెస్విన్



జెస్విన్‌ను సత్కరిస్తున్న వాసవీ సభ్యులు

పాలకొల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని 78 దేశాల జాతీయ పతాకాలను గుర్తించి తన ప్రతిభను నాలుగేళ్ల చిన్నారి జెస్విన్ ప్రసాద్ చాటుకున్నాడు. పట్టణానికి చెందిన శ్రీఖాకొళ్ళపు రాజేష్, లలిత దంపతుల పెద్ద కుమారుడు జెస్విన్ ప్రసాద్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. తల్లిదండ్రులు చదువులపై మక్కువతో చిన్నారికి ఎన్నో అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆరు మాసాలు వచ్చేసరికే పలు దేశాల జాతీయ జెండాలను గుర్తించే విధంగా శిక్షణ ఇచ్చారు. వాహనాలు, జంతువులు పండ్లు, పక్షులు ఇదేవిధంగా సుమారు 300 పదాల వరకు నేర్పించడం జరిగిందని తల్లి లలిత తెలిపారు. చిన్నారిని స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు. ఎంవీవీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



నెట్ బాల్‌ను ఆడుతున్న క్రీడాకారులు

లింగపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం క్రిసాలిస్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి అండర్-19 నెట్ బాల్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బోర్డ్‌ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ టి.శేఖర్ బాబు, బోర్డ్‌ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ కే యోహాన్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను ప్రారంభించారు. తొలిరోజు అండర్-19 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా టీం కర్నూల్ టీంపై 14-01 గోల్స్‌తో గెలుపొందిందని జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజ్ తెలిపారు.

శ్రీ వారి ఏడు వారాల దీక్ష స్వీకరణ



మాలధారుల దీక్షధారణ

ద్వారకాతిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందా.. అంటూ దాదాపు 30 మంది భక్తులు శనివారం వేకువ జామున శ్రీవారి ఏడువారాల దీక్షను స్వీకరించారు. ముందుగా ఆలయ ఆవరణలో పూజలు చేశారు. వీరంతా వచ్చేనెల 30న ముక్కోటి ఏకాదశి నాడు దీక్షా విరమణ చేస్తారు. అలాగే కార్తీక మాసం ఆఖరి శనివారం, ఏకాదశి పర్వదినం కారణంగా అధిక సంఖ్యలో భక్తులు చినవెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది.

రాష్ట్రానికి పరిశ్రమలు.. ఓర్వలేకపోతున్న జగన్

మంత్రి నిమ్మల రామానాయుడు



అబ్బిరాజుపాలెంలో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

యలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలు క్యూకడుతుంటే జగన్ ఓర్వలేకపోతున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్నారు. మండలంలోని అబ్బిరాజుపాలెంలో రూ.55 లక్షలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పనులు, కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి, అభి వృద్ధి జరగకుండా అడ్డుకునే ప్రయత్నం వైసీపీ పేటీఎం బ్యాచ్ చేస్తోందని విమర్శించారు. తమ పాలనలో అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ నాయకులకు ప్రజల వద్దకు వచ్చే అర్హత, మాట్లాడే హక్కు లేదన్నారు. అర్ధరూపాయి అభివృద్ధి చేయని వైసీపీకి ఎందుకు ఓటు వేశామా అని, ఓటు వేసిన ఇరవై, ముప్పై శాతం ప్రజలు ఆలోచించాలన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని అధిగమిస్తూనే సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. పెన్షన్ పెంపు, చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాత సుఖీభవ, డీఎస్సీ ద్వారా 16,354 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు సాయం, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. రహదారుల నిర్మాణాలు, పంట, మురుగు కాలువల్లో పూడిక, డెక్క తొలగింపు, పుంత రోడ్ల నిర్మాణం, ప్రతి గ్రామంలోనూ తాగునీటి పథకాల పనులు చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి వైపు ఓటు వేయాలని, విధ్వంసం వైపు కాదని మంత్రి పేర్కొన్నారు. ఎన్డీఏ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కబర్ది, కడలి గోపాలరావు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, డేగల సత్యనారాయణ, చిట్టూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఎన్‌ఆర్‌ఐలు

ఎమ్మెల్యే రోషన్ చొరవతో పెట్టుబడులు

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవతో విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో ఎన్‌ఆర్‌ఐలు రూ.500 కోట్లు పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం ఈ బృందం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐటీ, బయోసైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నట్టు ఈ బృందం ప్రతినిధి అశోక్ పేర్కొన్నారు. వీరితో రోషన్ తరచూ గ్రూపు సమావేశాలు జరిపి వారిని ఐటీలో పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహించారు. ఈ సదస్సులో భాగస్వామ్యం కల్పించడంతో శనివారం ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పంద సమయంలో యూఎస్ఏ ప్రతినిధులు ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే సదస్సులో పాల్గొన్నట్టు లోకేశ్ వివరించినట్టు రోషన్ క్యాంపు కార్యాలయం ప్రకటించింది.



సుమన్‌ను సత్కరిస్తున్న అంబికా కృష్ణ, ఉషాబాల బాలకృష్ణ

సుమన్‌కు సూపర్‌స్టార్ కృష్ణ విశిష్ట పురస్కారం

ఏలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా సూపర్‌స్టార్ కృష్ణ ఎప్పటికీ నిలిచిపోతారని, ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్టు ప్రముఖ సినీనటుడు సుమన్ తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో కృష్ణ తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీ నిర్మాత అంబికాకృష్ణ, ఉషాబాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత వి.వి.బాల కృష్ణరావు హాజరయ్యారు. 'సూపర్ స్టార్ కృష్ణ విశిష్ట వ్యక్తి' పురస్కారాన్ని సుమన్‌కు ప్రదానం చేశారు. తొలుత ఏలూరులోని జన్మభూమి పార్క్ వద్ద ఉన్న కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఐఐటీ కెమికల్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ శర్మ అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో శనివారం ఫ్రం ఎర్త్ టూ మార్స్ ఫైనీరింగ్ మెటల్ సీవోటు బ్యాటరీ సొల్యూషన్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాటరీలు విద్యుత్‌ను రసాయన రూపంలో నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు విద్యుత్ శక్తిగా మార్చుకుంటాయన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న లిథియం అయాన్ బ్యాటరీకి ప్రత్యామ్నాయంగా మెటల్ సీవోటు బ్యాటరీలపై విస్తృత పరిశోధనలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వినోత్‌కుమార్‌రాజాలు చంద్రశేఖర్‌ను సత్కరించారు.

2న ఆక్వా సమస్యలపై ఆందోళన

పాలకొల్లు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తీసుకు వస్తున్న ఆక్వా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆరోపించారు. ఇందుకు నిరసనగా డిసెంబరు 2న రొయ్య రైతులంతా ఆందోళనకు దిగనున్నామన్నారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆక్వా రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు.

హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో రైళ్లకు తాత్కాలిక స్టాప్

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో 16 రైళ్ళకు తాత్కాలికంగా స్టాప్‌లను కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అది తగ్గించే దృష్ట్యా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో కూడా 14 రోజుల పాటు రైళ్ళను ఆపడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 7వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఈ రైళ్ళకు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో స్టాప్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

12749 మచిలీపట్టణం - బీదర్, 17255 నర్సాపూర్ - లింగంపల్లి, 12737 కాకినాడ పోర్టు - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖ, 12775 కాకినాడ టౌన్-లింగంపల్లి, 17207 సాయినగర్ శిర్డి-మచిలీపట్టణం, 17205 సాయినగర్ షిర్డి-కాకినాడ పోర్టు, 18519 విశాఖ- ఎల్‌టిటి ముంబై, 17208 మచిలీపట్నం-సాయినగర్ షిర్డి, 17206 కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి, 12805 విశాఖ - లింగంపల్లి, 18520 ఎల్‌టీటీ ముంబై - విశాఖ, 12738 లింగంపల్లి - కాకినాడ పోర్టు, 17256 లింగంపల్లి - నర్సపూర్, 12750 బీదర్ - మచిలీపట్టణం

విర్డ్‌లో ఎముకల క్యాన్సర్ సేవలు



వైద్య చేస్తున్న అంకాలజీ సర్జన్ రాజీవ్‌రెడ్డి

ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విర్డ్ ఆసుపత్రిలో ఇకపై ఆర్థోపెడిక్ అంకాలజీ (ఎముకల క్యాన్సర్ స్పెషలిస్ట్) వైద్యసేవలు అత్యాధునికంగా అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో శనివారం ప్రముఖ ఆర్థోపెడిక్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ రెడ్డి వైద్యసేవలు అందించారు. ఇందులో భాగంగా ఐదుగురిని పరీక్షించి అందులో ఇద్దరికి శస్త్రచికిత్సలు డాక్టర్ రాజీవ్ రెడ్డి నేతృత్వంలో వైద్యబృందం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టీలు నారాయణమూర్తి ఎస్వీ నివృతరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పీవీ నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో జాతీయ గణిత వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత అభివృద్ధిలో గణితం పాత్ర అనే అంశంపై ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్క్‌షాపు పోస్టర్లను ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇండియన్ అకాడమీ ఆఫ్ మాథ్స్ సైన్సెస్, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, తదితర జాతీయ సంస్థల నుంచి ప్రొఫెసర్లు, పరిశోధకులు, మేధావులు, పలు కళాశాలల విద్యార్థులు రెండురోజుల వర్క్‌షాపునకు హాజరవుతారని వివరించారు.

13 మంది జడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు

ఏలూరు సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి 'పశ్చిమ' జడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న 13మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. వీరికి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ఉత్తర్వులను అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగులు సేవా మార్గంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా పదోన్నతులు ఇవ్వటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్ మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పని చేయాలన్నారు. జడ్పీ కార్యాలయ ఏఓ ఐవీ రాఘవులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నాగసాధువులు



ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):చిన వెంకన్న ఆలయాన్ని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నాగసాధువులు సందర్శించారు. ఆలయానికి వచ్చిన వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు క్షేత్రానికి వచ్చిన భక్తులు వారిని విస్మయంతో చూశారు.

వరిపై మందులు పిచికారి చేయవద్దు

పెనుమంట్ర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గుర్తించడం జరిగిందని రైతులు విచక్షణారహితంగా పురుగు మందులు, తెగులు మందులను పిచికారి చేయడం గమనించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ ఎన్. మల్లికార్జునరావు అన్నారు. సోమరాజు ఇల్లిందలపర్రులో శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో వరి పంటపై ఆశించిన ఎండు తెగులును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎంటీయు 1318 రకం కోతకు వచ్చేటటువంటి వరిపంటల పై ఏ విధమైన సస్యరక్షణ చర్యలు చేపట్టనవసరం లేదన్నారు. కోత దశలో ఉన్న వరిపై పిచికారి చేసి డబ్బులు వృథాచేసుకోవద్దని రైతులకు సూచించారు.



వైటీ రాజాకు ఘన నివాళులు

తణుకు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):తణుకు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే దివంగత వైటీ రాజా మార్గదర్శకత్వం చూపించారని రెరా సభ్యులు మం త్రిరావు వెంకటరత్నం అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వైటీ రాజా వర్ధంతి పురస్కరించుకుని సంతాప సభ నిర్వహించారు. వైటీ రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైటీ రాజా రాజకీయాల నుంచి వైదొలుగుతూ రాజకీయ విలువలు కలిగిన ఆరిమిల్లి రాధాకృష్ణను నియోజకవర్గానికి పరిచయం చేశారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిలో అదే ఒరవడిని ఎమ్మెల్యే రాధాకృష్ణ కొనసాగిస్తున్నారని తెలిపారు.

72 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీ అధికారులు ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై విస్తృతం గా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివా రం ఉదయం వరకు ఏలూరు జిల్లా కలపర్రు టోల్‌గేట్, జంగారెడ్డిగూడెంలో ఆర్టీవో ఎస్‌బి శేఖర్, ఎస్ఎస్ రంగనాయకులు పర్యవేక్షణలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు ప్రత్యేక బృందాలతో ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీలు నిర్వహించారు. మొత్తం 72 బస్సులపై 72 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. ఈ బస్సులపై 7 లక్షల 65 వేల 230 రూపాయల అపరాధ రుసుము విధించగా అప్పటికప్పుడే నాలుగు లక్షల 50 వేల 100 రూపాయలు వసూలు అయినట్లు తెలిపారు. ధృవపత్రాలు లేకపోవడం, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు, పాసింజర్ లిస్టులేని, తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలు ప్రతి రోజు నిర్వహిస్తామని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు.

ఒంటరి మహిళలే టార్గెట్

అంతర్ జిల్లా గొలుసుల దొంగ అరెస్టు



బాధితురాలికి పోగొట్టుకున్న బంగారాన్ని అందిస్తున్న ఎస్పీ నయీం

పెనుగొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఒంటరి మహిళలను టార్గెట్ చేసే అంతర జిల్లా గొలుసు దొంగను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇలపర్రు గ్రామంలో ఒక అపరిచిత వ్యక్తి బుల్లెట్ మోటారు సైకిల్‌పై వచ్చి సుమారు 67 వయస్సు గల చేకూరి బంగారమ్మ అనే మహిళ మెడలో నుంచి అడ్రసు అడుగుతున్నట్లు నటించి సుమారు 3 కాసుల బంగారపు తాడును బలవంతంగా లాక్కుని పారిపోయినట్లు తెలిపారు. పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్ఐ గంగాధర్, ఆచంట ఎస్ఐ కేవీ రమణ కలిసి రెండు బృందాలుగా ఏర్పడి కేసులో నిందితుడిని రెండు రోజులలో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు తెలిపారు. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కండ్రికపేట, ఆలమూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు నుంచి దొంగిలించిన వస్తువును తిరిగి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపర్చినట్టు తెలిపారు. వీరబాబు వృత్తి రీత్యా డ్రైవర్. కాని చెడు అలవాట్లకు లోనై 2012 నుంచి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతనిపై అనేక పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలికి ఎస్పీ చేతుల మీదగా బంగారం అందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఫాతిమాపురం అడ్డరోడ్డు వద్ద విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో శనివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. ఈ తనిఖీ లో 35.09 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కలపాల సుధాకర్‌ను ప్రశ్నించగా కఠారి శ్రీను, నున్నా రమేష్, చిలకమ్మ, సీతారాములుకు చెందిన రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి చాట్రాయి మండలం మర్లపాలెంకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రరావు, వంగల దత్తులకు కిలో 19 రూపాయలు చొప్పున అమ్ముతున్నట్టు తెలిపాడని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో లక్షా 40 వేల 360 రూపాయలు విలువ గల బియ్యాన్ని, ఎనిమిది లక్షల రూపాయలు విలువ చేసే వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌తోపాటు అతనికి తెలిపిన వారందరిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్ఐ సి.హెచ్.రంజిత్‌కుమార్, మండల డీటీ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థికి గాయం

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి మెడపై గాయం, రక్త మరకలు శనివారం తెల్లవారుజామున పాఠశాల యాజమాన్యం గమనించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదే హాస్టల్‌లో చదువు తున్న మరో విద్యార్థి తెల్లవారుజామున నిద్రిస్తున్న సమయంలో పెన్సిల్ చెక్కె చాక్ మర్‌లో ఉండే బ్లేడుతో గాయపరి చినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ గురుకుల పాఠశాలకు వెళ్ళి నిర్ధారణ జరిపారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగిందని, మైనర్ విద్యార్థులు కావడంతో దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. దీనిపై డీవైఈవో సుధాకర్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ అధికారులపై వేటు

ఉండి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేశారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకినాడ బదిలీపై వెళ్లిన ఎం.వి సుధారాణి, సీనియర్ అసిస్టెంట్ పి. సారబంధు రాజులను సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్ అఫ్ జనరల్ మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. వెబ్ ల్యాండ్ వివరాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం పంపిన పరి శీలన బృందం నివేదిక ఆధారంగా సబ్ రిజి స్ట్రార్ కార్యాలయం అధికారులపై చర్యలు తీసు కున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలంలోని ఒక గ్రామా నికి చెందిన 14 ఏళ్ల బాలికతో ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడానికి చెందిన తుని మెల్లి మణికంఠ (20) పరిచయం చేసుకుని మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానని నమ్మ బలికాడు. బాలికతో శారీరక సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆ బాలిక మందుబిళ్ళలు మింగి ఒక ఆసుపత్రిలో చేరింది. ఏలూరు రూరల్ పోలీసులు మణికంఠపై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదమల్లంలో కార్డెన్ సెర్చ్



మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని రికార్డులు పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఆచంట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పెదమల్లంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాల్లో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, యజమాని వివరాలు సరిగ్గా లేని పలు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు వాహనాలకు సంబంధించి రికార్డులుక్షుణ్ణంగా పరిశీలించేందుకు వాటిని ఆచంట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విజయ కుమార్ గ్రామంలోని స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినపుడు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గమనించినట్లయితే ఎలాంటి భయం లేకుండా వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులను కోరారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు కె. వెంకట రమణ, కె. స్వామి, కె. గంగాధర్ పాల్గొన్నారు.



డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందిస్తున్న ఎస్ఐ నాగమణి

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రవిచంద్ర

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా యు.రవిచంద్ర శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరులో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా మహిళా ఎస్ఐ నాగమణి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మహిళలపై జరిగే నేరాలపై వేగవంతమైన, పారదర్శకమైన విచారణ చేపడతామన్నారు. శక్తి టీమ్ సభ్యు లతో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కాలేజీల వద్ద మహిళలు, బాలికలపై ఆకతాయిలు వేధింపులకు గురి చేయకుండా గట్టి గస్తీ నిర్వహిస్తామన్నారు.

చోరీ కేసులో హిజ్రా అరెస్టు

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఈదరలో ఇటీవల జరిగిన చోరీ కేసులో షేక్ మున్నా అలియాస్ (సిరి) అనే హిజ్రాను అరెస్టు చేసి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. ఈ నెల 3న కొత్త ఈదరలోని బెక్కం పెద్ద సీత ఇంట్లో బంగారం చోరీ కావడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శుక్రవారం హైస్కూల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న హిజ్రాను అదుపులోకి తీసుకొని విచారించి నాలుగు బంగారు ఉంగరాలు, చెవి దిద్దులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హిజ్రాపై 22 కేసులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెస్టారెంట్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

భీమవరంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :భీమవరం పట్టణంలోని పలు రెస్టారెంట్లను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రత అధికారి సుందర రామరెడ్డి తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నిలువ ఆహార పదార్థాలను విక్రయించడం నేరమన్నారు. కొన్ని రెస్టారెంట్లలో అధిక రసాయనాలు కలిపి విక్రయిస్తున్నట్టు అనుమానించి శాంపిల్ తీసి స్టేట్ ఫుడ్ లాబరేటరీకి పంపామని తెలిపారు. హోటల్ యజమానులు పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలోని జిల్లా కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు చట్టసభల్లో 33శాతం స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్‌లు అమలుచేయాలని కోరారు. వావిలాల సరళాదేవి, కేశవభట్ల విజయ్, కాజులూరి దుర్గామల్లేశ్వరరావు, నాయుడు పండు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి రోజులు : ఎమ్మెల్యే ఆరిమిల్లి


విశాఖ సదస్సులో ఆరిమిల్లి, నాయకులు

తణుకు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి నుంచి పెద్దఎత్తున పరిశ్రమలు రావడంతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం విశాఖపట్టణంలోని సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, గల్లా జయదేవ్‌లతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న విప్ నాయకర్, పొత్తూరి, కొవ్వలి, కొల్లు

'ఆలయాల అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి'

నరసాపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కొత్త పాలకమండలి కృషి చేయాలని విప్ నాయకర్ అన్నారు. శనివారం పట్టణంలోని అమరేశ్వర పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి నాయుడు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. చైర్మన్ తిరుమాని రాజు, పాలకవర్గంతో ఈవో రాము ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ అమరేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, దేశెట్టి గంగాధర్, పొన్నాల నాగబాబు, గునిశెట్టి శ్రీను, సత్యవతి, కాగితపు వెంకటేశ్వరావు, వనమాల శ్రీనివాసరావు, బర్రె మురళీ, శశిదేవి, శ్రీదేవి, సునీత, నాత్ర నరేష్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం : ధర్మరాజు


గణపవరంలో భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షల అంచనావ్యయంతో నిర్మించే పబ్లిక్ హెల్త్ యూనిట్ అదనపు బిల్డింగ్‌ను శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గణపవరంలో పురవీధుల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై జరిగిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. పరసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, సర్పంచ్ మూరా అలంకారం, పంచాయతీ కార్యదర్శి శివరామ్‌ప్రసాద్, ప్రభుత్వ వైద్యాధికారులు కిరణ్మయి, ఓంకార్‌నాథ్, జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గణపవరం, కాశీపాడు సొసైటీ చైర్‌పర్సన్‌లు కె.సురేంద్రకుమార్‌రాజు, కె.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


పాలకొల్లులో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బిహార్‌లో విజయంతో బీజేపీ సంబరాలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ బిహార్ రాష్ట్రంలో ఘన విజయం సాధించడంతో పట్టణంలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక కెనాల్ రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తొలుత గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు కొల్లి కొండప్రసాద్, సీనియర్ నాయకులు జక్కంపూడి కుమార్, ఉన్నమట్ల కబర్ధి, కేవీ కృష్ణవర్మ, యర్రంశెట్టి పద్మారావు, అల్లూరి పద్మావర్మ, నాళం బాబి, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ చొరవతో ప్రభుత్వ భవనాలకు హంగులు


పాలకోడేరు సచివాలయంలో తయారైన బాత్‌రూమ్

పాలకోడేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చొరవతో ప్రభుత్వ భవనాలకు మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో అన్ని వసతులు సమకూరాయి. పాలకోడేరులోని కోడిగట్టు వద్ద ప్రభుత్వ స్థలంలో కొన్నినెలల క్రితం సచివాలయ భవనాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించి ప్రారంభించారు. వీటికి సరైన వసతులు లేకపోవడంతో ఆ భవనాల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదు. ఈ విషయం డిప్యూటీ స్పీకర్ దృష్టికి వెళ్లడంతో శుక్రవారం ఆయన అనుచరులైన డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథ రాజు మురళీకృష్ణంరాజు, పాలకోడేరు సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు వాటిని పరిశీలించి అన్ని వసతులు ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించారు. మూడు భవనాలకు బాత్‌రూమ్‌లు, మంచినీటి సౌకర్యంతోపాటు వెల్‌నెస్ సెంటర్‌కు చుట్టూ రెయిలింగ్‌తోపాటు పనులను చేయిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వ భవనాలు వినియోగంలోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు, అధికారులు అభినందించారు.

సిల్వర్ షాక్ !

(5వ పేజీ తరువాయి)

చైనా బార్, పూసల్ని లిక్విడ్ రూపంలో కొనుగోలు చేశారు. కొందరు స్టాక్ లేకపోవడంతో అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. అత్యధిక వ్యాపారం నరసాపురం, భీమవరం మార్కెట్‌ల్లో జరిగింది.

ఒక్కసారిగా పతనం

మార్కెట్ అంచనాలన్నీ గత నెల రెండో వారంలో పటాపంచలయ్యాయి. ఇజ్రా యిల్, పాలస్తీనా మధ్య ఒప్పందం, చైనా, అమెరికాల మధ్య వాణిజ్య ట్రేడ్‌పై ట్రంప్ సానుకూల ప్రకటనల ప్రభావం బులియన్ మార్కెట్‌పై పడింది. దీంతో అమ్మకాలు మొదలయ్యాయి. ఒకానొక దశలో ఒక్క రోజులోనే కేజీ వెండి రూ 10 వేలు పతనమైంది. దీన్ని చూసిన మదుపుదారులు కలవర పడ్డారు. రానున్న రోజుల్లో 2007, 2011 నాటి పరిస్థితులు వస్తాయన్న భయంతో కొన్న వెండిని ఆయినకాడికి అమ్మకాలు మొదలుపెట్టారు. అప్పట్లో పతనమైన వెండి మళ్లీ పెరుగుదలకు 14 ఏళ్లు పట్టింది. ఇంతకాలం పెట్టుబడి పెట్టి కూర్చుంటే వడ్డీ నష్టమని భావించి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఇటు వ్యాపారులు కూడా ధర తగ్గించి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు

రీ సర్వే చిక్కులు

(5వ పేజీ తరువాయి)

ఆ పథకం అందినా ఇతర పథకాల కోసం రైతులు భయపడుతున్నారు. రెడ్‌మార్క్ వల్ల భూమి అమ్మకాలకు ఆటంకంగా మారింది. తల్లిదండ్రులు వారి పిల్లలకు పంట భూమి రాయాలంటే వీలు కావడం లేదు. పిల్లల చదువు ఖర్చులకు భూమి అమ్మడానికి లేదు. దీంతో రైతులు గందరగోళంలో ఉన్నారు. గతంలో పంటభూమి ద్వారా పొందిన బ్యాంకు రుణాలు రీ షెడ్యూల్ చేసుకోవడానికి వీలులేదు. బ్యాంకుల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.







ఎల్‌బీ చర్లలో స్కూల్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఆర్డీవో దాసిరాజు.. పెనుగొండలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ.. మొగల్తూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఆర్డీవో దాసి రాజు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

నరసాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆర్డీవో దాసిరాజు అన్నారు. ప్రతినెల మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు శాఖల అధికారులు క్లీనింగ్ బాట పట్టారు. ఎల్‌బీచర్ల హైస్కూల్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఆయన తుడిచి, బాత్‌రూమ్‌లను క్లీన్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెట్ల, కొమ్మలను తొలగించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో వీరభద్రరావు, ఎంఈవో పుష్పరాజ్యం, స్కూల్ సిబ్బంది, డీటీ ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

● పెనుగొండ : వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రి అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం చేతులు శుభ్రంగా కడుకునే కార్యక్రమం నిర్వహించారు.

● ఇరగవరం :గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రంగమ్మరెడ్డి తెలిపారు. ఇరగవరంలో ఆరోగ్య పరిశుభ్రత- జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు.

● మొగల్తూరు:వ్యక్తిగత సామాజిక పరిశుభ్ర తపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించు కోవా లని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహనరావు సూచిం చారు. స్థానిక ప్రతిభ స్కూల్ విద్యార్థులతో సచివాలయం, పంచాయతీ ఉద్యోగులు అవగా హన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ముచ్చర్ల చిన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

● భీమవరం రూరల్ : స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ మునిసిపల్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, అతిథులు, ఉపాధ్యాయులు పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సులేమాన్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. హెచ్‌ఎం షేక్ బాబాజీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : శారీరక ఆరోగ్యానికి ఆత్మ విశ్వాసం తోడైతే వ్యాధులను జయించవచ్చని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. కళాశాలలో శనివారం ఉమెన్ ఎంపవర్‌మెంట్, రెడ్ రిబ్బన్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో సర్వికల్ క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొల్ల భాస్కరమ్మ, వీరరాఘవులు ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ ఎ.మౌనిక మాట్లాడారు. ఫెమినా క్లబ్ ప్రెసిడెంట్ ఆర్.దీప్తి, కార్యదర్శి డి.మౌనిక, కోశాధికారి ఎం.ఉమా, సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి : జేసీ

భీమవరంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, తద్వారా సామూహిక శుభ్రత అనేది సాధ్యమవుతుందని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రూస్వేల్ట్ మునిసిపల్ బాలికల హైస్కూల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎ. రాంబాబు, మునిసిపల్ ఇంజనీర్ తిరనాథ రావు, ఎంహెచ్‌వో సోమశేఖర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరెడ్డి ఉన్నారు ముందుగా వ్యక్తిగత పరిశుభ్రతపై ఏర్పాటుచేసిన అవగాహన స్టాల్‌ను ఆయన పరిశీలించారు.


భోజనాలు అందజేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉమా, తదితరులు

సీహెచ్‌సీలో రోగులకు భోజన సదుపాయం

ఆకివీడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజన సౌకర్యం కల్పించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా అన్నారు. స్థానిక సీహెచ్‌సీకి వచ్చే రోగులకు శనివారం ఆయన భోజనాలు అందజేసి మాట్లాడారు. ఆకివీడు ప్రభుత్వాసుపత్రి ఏర్పాటుచేసి ఏళ్ల గడుస్తున్నా రోగులకు భోజన సౌకర్యం లేకపోవడంతో అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు చొరవడంతో టెండర్ ఏర్పాటు చేయడంతో అయ్యర్ వాసు దక్కించుకోవడంతో భోజనాలు అందిస్తున్నామన్నారు. కూటమి నేతలు, వైద్యులు గణేష్ ఉన్నారు.

పోస్టుమార్టం రూమ్‌కు భూమిపూజ..

ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం రూమ్ నిర్మాణం జరిగితే బాధితులు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకటసత్యనారాయణరాజు అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిలో చాంబర్ ఆఫ్ కామర్స్ దాతలు రూ.6లక్షలు సహకారంతో నిర్మించే గదికి శనివారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కౌన్సిలర్ గోపిశెట్టి వెంకటసత్యవతి, వైద్యులు బిలాల్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కోదండ రామాలయ విగ్రహాల ప్రతిష్ఠ

నరసాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వైఎస్‌పాలెంలో శనివారం కోదండ రామాలయ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితులు ఆనిల్ సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాములోరి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్నలతో పాటు పలువురు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు వైఎస్ బాబులు, కాసులు, హరి, రాంపండు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దాలి'

పెంటపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తే మేధావులుగా తీర్చి దిద్దవచ్చని సర్వశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో నియోజవర్గ స్థాయిలో ప్రత్యేక విద్యార్థులకు శనివారం ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమానికి ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ అధ్యక్షత వహించగా డీపీవో రామనాథ్‌రెడ్డి మాట్లాడారు. ప్రత్యేక విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఎంఆర్ కిట్స్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో రాంప్రసాద్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, సహిత విద్యా సమన్వయకర్త శ్రీనివాసరావు, హెచ్‌ఎం రాజేష్‌కుమార్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు సాయి స్వరూప, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

మొగల్తూరు, నవంబర్15(ఆంధ్రజ్యోతి): తూర్పుతాళ్ళు గ్రామంలో పేకాట స్థావరంపై మొగల్తూరు పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.13,560 నగదు స్వాధీనం చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్‌ఐ వై.నాగలక్ష్మి తెలిపారు.

'హారిక హత్య కేసులో వైసీపీ నేతల పాత్ర'

తణుకు, నవంబరు15(ఆంధ్రజ్యోతి):తణుకు మండలం ముద్దాపురంలో హత్యకు గురైన ఇంజనీరింగ్ విద్యార్థిని ముళ్లపూడి నాగహారిక కేసులో అప్పటి వైసీపీ నేతల హస్తం ఉందని తణుకు టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. శనివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తేతలి సొసైటీ అధ్యక్షుడు మట్టా వెంకట్‌తో పాటు హారిక సమీప బంధువు ముళ్లపూడి సతీష్ మాట్లాడారు. హారిక హత్య ముమ్మాటికి రాజకీయ హత్య అని చెప్పారు. 2022 నవంబరు 12న నాగహారిక హత్య వెలుగు చూసిన వెంటనే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన అప్పటి పోలీసులు అనుమానితురాలు సవితి తల్లి ముళ్ళపూడి రూప, తండ్రి శ్రీను పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి అరగంటలోనే ఇంటికి పంపించి వేశారని గుర్తుచేశారు. కేసు మాఫీ చేసేందుకు అప్పటి మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు వెనుక ఉండి ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి సుమారు రూ.50 లక్షలు చేతులు మారాయని ఈ వ్యవహారంలో అప్పటి వైసీపీ నేత మధ్యవర్తిత్వం చేశారన్నారు. ముళ్ళపూడి రూప వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలుగా ఉన్న సమయంలోనే ఆమె సోదరుడు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో చర్చలు జరిపిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వ్యవస్థలను ప్రలోభ పెట్టి కేసు నుంచి ఆమెను తప్పించారని ఆరోపించారు. హత్యకేసుతో సంబంధం లేదని, తమకు ఎలాంటి సంబంధం లేదని యువతి మృతి చెందిన ప్రదేశంలో బహిరంగ చర్చకు రావాలని వెంకట్ సవాల్ విసిరారు. అప్పటి సీఐ ఆంజనేయులు కేసులో పెద్దఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు.

ఒక మంచి పుస్తకం జీవితాన్నే మారుస్తుంది : వబిలిశెట్టి


భీమవరంలో విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

భీమవరంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఒక మంచి పుస్తకాన్ని చదివితే అవే నీ జీవితాన్ని మారుస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వబిలిశెట్టి కనకరాజు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా భీమవరం కేజీఆర్‌ఎల్ కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమ నాయకుల చరిత్రపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కళాశాల కార్యదర్శి మెంటే మనోహర్, కోశాధి కారి గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమ తులు అందించారు. యూత్ హాస్టల్స్ అధ్యక్షుడు కటికిరెడ్డి వెంకటర త్నం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామచంద్రమూర్తి, డైరెక్టర్ కె. నాగేశ్వరరావు, తోట శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

●పాలకోడేరు/ఇరగవరం/మొగల్తూరు/తణుకు : పాలకోడేరు శాఖ గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణరాజు, ఎంపీడీవో వి.రెడ్డియ్య, ఈవోపీ అండ్ ఆర్‌డి రాంప్రసాద్, ఎంఈవో నాగరాజు, విద్యార్థులు సందర్శించారు. ఇరగవరం మండ లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.నాగమణి ఆధ్వర్యంలో, మొగల్తూరు మండలం మొగల్తూరులోని మెగా స్టార్ చిరంజీవి శాఖ గ్రంథాలయంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తణుకు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. న్యాయవాది గుడిమెట్ల వీర్రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు : జేసీ

భీమవరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు, వివాదాలు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ చాంబర్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, అర్హులైన వారందరికీ ఇళ్ల, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల ప్రగతిపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంఎల్‌వోలు, వ్యవసాయ శాఖ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు జిల్లాలో కోటి 25 లక్షల గన్నీబ్యాగులు అవసరంకాగా 50 శాతం మిల్లర్ల వద్ద తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం రవాణాకు 2,544 వాహనాలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ అయ్యాయని, మరో వెయ్యి వాహనాలు రిజిస్ట్రేషన్ సత్వరమే పూర్తి చేయాలన్నారు. అందరికీ ఇల్లు పథకంలో ఇప్పటి వరకు అర్హులైన 4,500 మంది దరఖాస్తులను పాత లే-అవుట్‌లో ఖాళీగా ఉన్నచోట సర్దుబాటు చేయాలన్నారు. ఎంతవరకు సర్దుబాటు చేయగలమో మ్యాపుల్లో గుర్తించి జిల్లా రెవెన్యూ అధికారికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. డీఆర్‌వో బి.శివన్నారాయణరెడ్డి, డీఎస్‌వో ఎం.సరోజ, ఆర్డీవోలు, తహసిల్దార్లు, డీసీవో, ఎంపీవోలు, ఎంఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.





భీమవరంలో అమ్మవార్ల ఆలయంలో దీపోత్సవం.. పాలమూరులో లక్ష దీపోత్సవం

వైభవంగా కార్తీక కోటి దీపోత్సవం

భీమవరంటౌన్/పెనుమంట్ర/ఆచంట/పాలకొల్లుఅర్బన్/కాళ్ల/యలమంచిలి/ పెనుగొండ/ భీమవరంటౌన్/తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద శనివారం రాత్రి వైభవంగా కార్తీక కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. దీపోత్సవాన్ని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. అర్చకులు పండితుల ఆధ్వర్యంలో ముందుగా భక్తుల చేత పూజలు చేయించి దీపాలను వెలిగించారు. టీడీపీ సీనియర్ నాయకుడు మెంటే పార్థసారథి, భీమనాథం వీరశేషారావు, మాదాసు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరులోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దీపాల వెలుగుతో ఆలయం శోభాయమానంగా నిలిచింది. ఆచంట మండలం ఆచంటేశ్వరునికి లక్షపత్రి పూజ , పార్వతి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. శెట్టిబలిజ సంఘం ఆధ్వ ర్యంలో పూజలు నిర్వహించారు. పంచారామ క్షేత్రం క్షీరారామలింగేశ్వర స్వామికి కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా పండితులు లక్షపత్రి పూజలు నిర్వహించారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల కార్యక్రమం జరిగింది. యలమంచిలి మండలం మేడపాడు లోని గ్రామదేవతలు కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ, కొర్లపాటి వెంకమ్మ అమ్మవార్ల నూతన విగ్రహ, యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. పెనుగొండ మండలం పెనుగొండలోని కామాక్షి అమ్మవారి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భీమవరం జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మూడురోజులుగా జరుగుతున్న స్వామివారి పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో గురుస్వామి నూకల ధనకృష్ణ 36వ సంవత్సరం శబరిమళ యాత్రకు వెళ్తున్న సందర్భంగా పడిపూజ నిర్వహించారు.

కేశవస్వామికి చందనోత్సవం



పోడూరు: పండిత విల్లూరులో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, శ్రీమరకత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా కేశవస్వామికి చందనోత్సవం నిర్వహించారు. గంధం అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. దీపోత్స వం, లక్ష ఒత్తుల ప్రజ్వలన, పంచహారతి నిర్వహించారు.

కియా ఓనర్‌షిప్ సర్వీస్ క్యాంపు

భీమవరంటౌన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి) : భీమవరంలోని కియా అధీకృత డీలర్ సింహా కియా షోరూమ్‌లో శనివారం ఓనర్‌షిప్ సర్వీస్ క్యాంప్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ రావెళ్ల తారకరస్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23 వరకు క్యాంపు నిర్వహిస్తామనారు. క్యాంపులో కస్టమర్ల కోసం కార్ ఉచిత బాబీ వాష్, కార్ కేర్ సర్వీస్‌లో 20శాతం డిస్కౌంట్, కాంప్లిమెంటరీ వెహికల్ హెల్త్ చెకప్ కారు ఎక్స్ఛేంజ్ చేసుకునేవారి ఉచి ఎవాల్యూషన్ వంటి ఆఫర్స్‌ను అందిస్తున్నామన్నారు. వివరాలకు 86888 36577, 77999 81516 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజీ పడదగ్గ కేసులు రాజీ కోసం డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా కోరారు. తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీలైనంత ఎక్కువగా కేసులు రాజీ చేసేవిధంగా కృషిచేయాలని న్యాయవాదులకు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జ్ కె.లలితాదేవి పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న భక్తులు

మావుళ్లమ్మ నిత్యాన్న దానానికి రూ.లక్ష విరాళం

భీమవరంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శాశ్వత అన్నదాన పథకానికి భద్రాచలం పట్టణానికి చెందిన పతకమూరి వెంకట సుబ్బారావు కిరణ్మయి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ శేషవస్త్రం ఫొటో ప్రసాదాలు అందించారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ తీగల రమేష్ రాక

పెంటపాడు,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలు తదితర వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీతో పాటు అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

ప్రతిరోజు హైదరాబాద్‌కు స్లీపర్ బస్సు

తణుకు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తణుకు ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు ఏసీ స్లీపరు బస్సు ఏర్పాటు చేశామని శనివారం ఓ ప్రకటనలో డీఎం గిరిధర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సర్వీసు ప్రతిరోజు తణుకు నుంచి బయలు దేరుతుందన్నారు. హైదరాబాదు నుంచి ప్రతి రోజు బీహెచ్‌ఈఎల్ నుంచి 9.45 గంటలకు బయలు దేరుతుందన్నారు. టికెట్ ధర రూ.1,430 మాత్రమే అని చెప్పారు. ఈ అవకాశాన్ని తణుకు పరిసర ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

'ఉచిత న్యాయ సలహాలు'

నరసాపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు న్యాయసేవా సమితి ద్వారా ఉచిత న్యాయ సలహాలను పొందవచ్చని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని సబ్‌జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, మెనూ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలర్ అప్పారావు, శిరీష, బి.శ్యామ్‌కుమార్, రాజీ, శశికళ పాల్గొన్నారు.

పది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో అక్రమంగా వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం సబ్సిడీతో అందించే పది గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. సిలిండర్లను అక్రమంగా కేటరింగ్స్‌లో వాడుతున్నట్టు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ ఎస్ఐ సీతారాం, సివిల్ సప్లయిస్ డీటీలు దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.23వేల విలువ చేసే పది గ్యాస్ సిలిండర్లు గుర్తించి వాటిని స్వాధీనం చేయడంతో పాటు యజమాని సోమిశెట్టి నాగవెంకట సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు.

గ్రామ దేవతకు తొలి జీతం అందజేత

కాళ్ళ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలం పెదఅమిరం గ్రామ దేవత పల్లాలమ్మ దేవాలయ అభివృద్ధికి ఉపాధ్యాయుడు బూరాడ వెంకటకృష్ణ శనివారం తన మొదటి జీతాన్ని అందజేశారు. ఇటీవల మెగా డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన ఆయన ఆలయ అభివృద్ధి కమిటీ పెద్ద కోరా రామ్మూర్తికి రూ.50,099 నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు గ్రామస్థులు అభినందించారు